## క్లుప్తంగా

### గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**భోగాపురం:** ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డివాము దగ్ధమైన సంఘటన సుందరపేట జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిగురు కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్నింటి శ్రీనివాసరావు అనే వ్యక్తి గడ్డివాము తరలించడానికి బొంతు సత్యనారాయణకు చెందిన ట్రాక్టర్ తీసుకుని సుందరపేట గ్రామానికి చెందిన తన బంధువైన పడాల సత్యారావు పొలాల వద్దకు వచ్చాడు. పొలంలో ఉన్న గడ్డిని ట్రాక్టర్‌లో లోడు చేసుకుని తిరిగి వెళ్తుండగా... జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కనున్న విద్యుత్ లైన్ గడ్డిని తాకడంతో ట్రాక్టర్‌లో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న విజయనగరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

### విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**పూసపాటిరేగ:** మండలంలోని కోనాడ జంక్షన్‌లో గల క్యాంపస్ చాలెంజ్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముత్తూట్ ఫిన్ కార్ప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపస్ చాలెంజ్ డైరెక్టర్ శర్మ, ముత్తూట్ బ్రాంచ్ మేనేజర్ అర్జున్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జ్ఞాన సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు



సరస్వతీ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

**విజయనగరం రూరల్:** ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో వసంత పంచమి పర్వదినాన పురస్కరించుకుని జ్ఞాన సరస్వతి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చాణక్య, శ్రీహర్షల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, పంచామృత అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్సీఎస్ ట్రస్టీలు నారాయణ శ్రీనివాస్, నీరజ వల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా నరసింహమూర్తి జయంతి**

ఎన్సీఎస్ చైర్మన్ నారాయణం నరసింహమూర్తి 94వ జయంతి వేడుకలు రామనారాయణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ దంపతులు రామనారాయణం ప్రాంగణంలో ఉన్న నరసింహమూర్తి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వేద పాఠశాల విద్యార్థులకు కానుకలు అందజేశారు.

### రూ.89.18 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగులు

**రాజాం:** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సదుపాయానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం పట్టణం, మండలంలోని పార్టీ కార్యకర్తలందరితో సమావేశమైన వారు పార్టీ బలోపేతం, అభివృద్ధి పనులపై సమీక్షించారు. తొలుత గృహసారథుల నియామకంపై ఆరాతీశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ గృహసారథుల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో రానున్న వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా మొత్తం రూ.89.18 కోట్ల వ్యయంతో జలజీవన్ మిషన్ పనులు చేపట్టి, ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. దీనిని స్థానికంగా ఉన్న నేతలు బాధ్యతగా తీసుకుని, పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. గతంలో 77 గ్రామాల్లోనే జలజీవన్ మిషన్ పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా మరో 128 గ్రామాల్లో కూడా జలజీవన్ మిషన్ పనులకు ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి..

- ఎస్పీ ఎం.దీపిక
- వాడవాడలా గణతంత్ర దినోత్సవం
- రెపరెపలాడిన జాతీయ జెండా



విజయనగరం క్రైమ్: జాతీయనాయకుల వేషధారణలో ఉన్న చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న వీసీ జీఎస్ఎన్ రాజు, తదితరులు



నెల్లిమర్ల: జాతీయ పతాకం ఎగురవేస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్



విజయనగరం అర్బన్: సీతం కళాశాలలో అతిథులను సత్కరిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి



విజయనగరం క్రైమ్: పీటీసీలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఆనందబాబు, తదితరులు



విజయనగరం అర్బన్: పతాకావిష్కరణలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, సభ్యులు



భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

**విజయనగరం క్రైమ్:** దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఎస్పీ ఎం. దీపిక అన్నారు. పోలీస్ వెల్ఫేర్ శార్వాణీ సంక్షేమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ దీపిక జెండా ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత చదువులు అందించాలని.. పిల్లలు కోరుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, జాతీయ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, ఆర్ఐ బి.రమణమూర్తి, వెల్ఫేర్ ఆర్ఎస్సై నారాయణరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో..**

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎస్పీ దీపిక పాల్గొని ఏఆర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన భారత రాజ్యాంగాన్ని జనవరి 26, 1950 నుంచి అమలు చేయడంతో సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగంగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్. మోహనరావు, దిశా డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో....**

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ సోల్మన్ జెండా ఎగురవేశారు. అనంతరం ఉద్యోగులు, పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకర్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పీటీసీలో..**

పోలీస్‌శిక్షణ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ టి. ఆనంద్‌బాబు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య భవనంలో...**

**విజయనగరం:** పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో 74వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వెత్స సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ రోజున ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్త, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి ఏవీఎస్ కుమార్, అడ్డా నరసింగరావు, డిమ్స్ రాజు, ఏవీ కృష్ణారావు, ముమ్మిడిశెట్టి సత్యనారాయణ, తవ్వా మోహనరావు, కోటేశ్వరరావు, మామిడిపాక జగన్మోహనరావు, వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పేర్ల సీతారామయ్యశెట్టి, అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షుడు కట్టమూరి శంకరరావు, బాలాజీ మార్కెట్ అధ్యక్షుడు బుడ్డెపు వెంకటరావు, ఉపేంద్ర, కట్టమూరి రత్నారావు, పి.రామారావు, వనిత వాసవీ క్లబ్ అధ్యక్షురాలు పేర్ల రమ్య, తదితరులు పాల్గొన్నారు.

**బాధ్యతగా మెలగాలి..**

గణతంత్ర దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు పిలుపునిచ్చారు. కార్యాలయ ఆవరణలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, తదితరులతో కలిసి మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ ఔన్నత్యాన్ని కమిషనర్ శ్రీరాములనాయుడు వివరించారు. అనంతరం ఉత్తమ సేవలందిస్తున్న వివిధ విభాగాల సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు కనకల నాగవల్లి, ఆల్తి సత్యకుమారి, పొట్నూరు శ్రీనివాసరావు, ఈఈ శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గిరిజన విశ్వ విద్యాలయంలో..**

**విజయనగరం అర్బన్:** పట్టణంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పించారు. కార్యక్రమంలో ఏఓ డాక్టర్ ఎన్వీఎస్ సూర్యనారాయణ, వీసీ వ్యక్తిగత కార్యదర్శి సుప్రియ, ఎస్.ప్రభాకర్, బి.రాము, డాక్టర్ అరుణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో ....**

పట్టణ శివారులోని జేఎన్‌టీయూ గురజాడ – విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జి. స్వామినాయుడు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్, రీసెర్చ్ డైరెక్టర్ బాబులు, ఎవాల్యేషన్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**సీతం ఇంజినీరింగ్ కళాశాలలో....**

గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహజకవి, గాయకుడు గొర్లె లక్ష్మణరావు, పాడి పరిశ్రమ వ్యవస్థాపకురాలు తూనిగుట్ల విజయకుమారి, మిడిల్ క్లాస్ మధు ఫేమ్ సాయికిరణ్‌లకు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిదేవమణి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**చాంబర్ ఆఫ్ కామర్స్‌లో..**

పట్టణంలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వాధ్యక్షుడు ఎం. వెంకటాచలం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో చాంబర్ కోశాధికారి అశోక్‌కుమార్ జైన్, ఉపాధ్యక్షులు ఎస్‌వీ శ్రీనివాస్, వీవీ శ్రీనివాసరావు, గోగుల శివకుమార్, జీఎస్ గుప్తా, చాంబర్ సహ కార్యదర్శి కాపుగంటి రవి, బొడ్డు శ్రీనివాసరావు, నరసింగరావు, హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ పూర్వాధ్యక్షుడు పీవీ రామారావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ కె..నరసింహం (ఊటీ), కార్యనిర్వాహక సభ్యులు, అనుబంధ సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**సంగీత కళాశాలలో..**

**విజయనగరం టౌన్:** మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి, రైల్వేస్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజర్ మురళీకృష్ణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఎస్ జానా, దేవదాయశాఖ కార్యాలయంలో సహాయ కమిషనర్ సుధారాణి, వీటీ అగ్రహారం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాపులో వర్క్స్ మేనేజర్ వరలక్ష్మి జెండా ఎగురవేశారు.



విజయనగరం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు



విజయనగరం క్రైమ్: జాతీయజెండా ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ దీపిక



విజయనగరం: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ శ్రీరాములనాయుడు, నగర మేయర్, డిప్యూటీ మేయర్లు



విజయనగరం అర్బన్: జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



డెంకాడ: నాతవలస టోల్‌ప్లాజా వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు



డెంకాడ: ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో జెండాకు వందనం చేస్తున్న కమాండెంట్ విక్రాంత్‌పాటిల్, తదితరులు



పూసపాటిరేగ : ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగులు

**కార్యాలయాలలో..**

**భోగాపురం:** మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాల ఆవరణలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎస్సై కృష్ణమూర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, సుందర హరీష్, పి.గురునాథరావు, ఎంటఈఓ రమణమూర్తి, టీడీ శ్రీనివాసరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

**టోల్‌ప్లాజా వద్ద..**

**డెంకాడ:** మండలంలోని నాతవలస టోల్‌ప్లాజా వద్ద గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, భోగాపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ, వైస్‌ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల భానుప్రకాష్, బమ్మిడి వెంకటరమణ, టోల్‌ప్లాజా సంఘ నాయకులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

**బెటాలియన్‌లో..**

చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో జాతీయ జెండాను బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్‌పాటిల్ ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి.వెంకటేశ్వరరావు, అధికారులు, మినిస్టీరియల్, మెడికల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ స్వరూపారాణి, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు జెండా ఎగురవేశారు.

**ఘనంగా ..**

**పూసపాటిరేగ :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రామారావు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎ.నరేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.శంకరరావు, ఓక్‌ల్యాండ్‌లో ప్రిన్సిపాల్ రవి జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, టి.సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

**సెంచూరియన్‌లో..**

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 74వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలో వీసీ జీఎస్ఎన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

**కొండవెలగాడలో..**

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని కొండవెలగాడ గ్రామ సచివాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో ..**

**నెల్లిమర్ల:** స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పి. బాలాజీప్రసాద్ జాతీయ పతాకం ఎగురవేశారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కోరుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## హస్తకళలను ప్రోత్సహించాలి

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి

**విజయనగరం:** తెలుగు సంప్రదాయానికి ప్రతిరూపాలైన చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ కల్యాణ మంటపంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన చేనేత వస్త్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో ప్రధాన పాత్ర పోషించిన చేనేత వస్త్రాలు మన దేశానికి గర్వకారణమన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించడం ద్వారా ప్రాచీన చేనేత కళను బతికించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వాహకులు మేయర్ విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. ప్రదర్శన నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో అన్ని జిల్లాల వస్త్రాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. గద్వాల్, ధర్మవరం, పోచంపల్లి, ఉప్పాడ, చీరలు.. మంగళగిరి కాటన్, చీరాల పట్టుచీరలు, డ్రెస్ మెటీరియల్, సిద్దిపేట గొల్లభామ చీరలు, గుంటూరు దుప్పట్లతో పాటు రకరకాల హస్తకాల సామాగ్రిని ఈ ప్రదర్శనలు ఉంచామన్నారు. కార్యక్రమంలో కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉపకరణాల పంపిణీ

**భోగాపురం:** సమగ్ర శిక్ష (విజయనగరం) అధికారులు మంజూరు చేసిన ట్రై సైకిల్, మూడు వీల్ చైర్స్, రెండు సీపీ చైర్స్, వినికిడి యంత్రంతో పాటు రొలెటర్ ఉపకరణాలను శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేస్తామని సహిత విద్య ఉపాధ్యాయుడు డీవీ రమణరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

### వైద్యశిబిరానికి స్పందన

**విజయనగరం:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని 30వ వార్డు ధర్మపురిలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోటరాక్ట్ అధ్యక్షుడు బాలి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ధర్మపురి రోటరాక్ట్ క్లబ్, వివేకానంద లైబ్రరీలు సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరంలో ఆపిల్ డెంటల్ వైద్యులు పాల్గొని సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలి సాయి, అశోక్, గోవింద్, కంది శంకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

### సేవలతోనే గుర్తింపు

- ఎంపీపీ కల్యాణి



ఉత్తమ ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు సీతాలక్ష్మి, తదితరులు

**పూసపాటిరేగ:** విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలు అందించిన ఉద్యోగులకే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సేవ చేయాలనే తపన ఉన్న ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### జీఓ 1 రద్దు చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ





నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

**విజయనగరం పూల్‌బాగ్:** జీఓ 1 రద్దు చేసి రాజ్యాంగాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బాలాజీ జంక్షన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ముందు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగం.. ప్రజాస్వామ్య హక్కులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక దేశమైన భారత దేశాన్ని హిందూ దేశంగా మార్చడానికే రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్నారు.అందులోభాగంగానే జీఓ 1 తీసుకువచ్చారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీఓ 1 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు, కమిటీ సభ్యులు పి.రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.